# ఇల్లాలి సుఖం

"అత్తకి నిండా బాగలేదు తెలుసా? సగమైపోయి వుంది... కాళ్ళు ,చేతులు పుల్లల్లా ఉన్నాయి. ఒంటికి కరుచుకు పోయిన చర్మంతప్ప ఒంట్లో ఎక్కడా కండలేదు. ఒకటే ఆయాసం, దగ్గు. నన్ను చూడగానే ఏడ్చేసింది" చెప్పింది అరుణ దిగులుగా.

నాకు గుండె గొంతులో కొచ్చినట్లుగా అయింది. అయినా దు:ఖాన్ని పంటి సందున అదిమి పెడుతూ

"అత్త ఎప్పుడు మాత్రం లావుగా ఉందనీ" అన్నాన్నేను. సన్నగా తెల్లగా, చెక్కబొమ్మలా ఎప్పుడూ వెంకటగిరి జరీ చీరల్లో ఉండే అత్తను గుర్తు చేసుకుంటూ.

అరుణ నాకేసి గుర్రుగా చూసింది. "లావుగా ఉండక పోవడం వేరు, అనారోగ్యంగా ఉండడం వేరు. నన్ను చూసింది మొదలు ఒకటే గొడవ అఖిల రాలేదా? అఖిల ఎలా ఉంది, దాని మొగుడిప్పుడు కోపం తగ్గించుకున్నాడా? సుఖంగా ఉంది కదూ... అంటూ" దాచుకుందామన్నా నిష్టురం దాగడం లేదు అరుణ గొంతులో.

అరుణ నా తరువాత పుట్టిందే అయినా, ఈ సాంసారిక, లౌకిక విషయాల్లో అత్యంత పెద్దదానిలా, ఆరిందాలా ప్రవర్తిస్తుంది. చిన్ననాడే తల్లిని కోల్పోవడంతో నేనూ, అరుణ సుఖ వేణత్త పెంపకంలోనే పెరిగి పెద్దవాళ్ళమయ్యాం. అత్త మమ్మల్ని ప్రాణం కన్నా మిన్నగా చూసుకునేది.

ముగ్గురు పిల్లల్నీ, భర్తను, పదెకరాల సేద్యపు భూమిని, సంసారాన్నీ వదిలి అనాథలైన అన్న పిల్లల కోసం నెలలో సగం కాలం పుట్టింట్లోనే గడిపేది సుఖవేణత్త. ఇందుమూలంగా భర్త తరపు నుండీ అత్తగారి వైపు నుండీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కోవలసి వచ్చేది ఆమె. సుఖవేణత్త తోడు, ఆదరణ లేకపోయినట్టయితే తండ్రి తమను సవ్యంగా పెంచగలిగేవాడు కాదేమో.

అపురూపంగా పెంచి పెద్దజేసి, అన్నివిధాలా గొప్పస్థాయిలో ఉన్నవాళ్ళతో మా పెళ్ళిళ్ళు జరిపించి తమనో స్థానంలో నిలబెట్టిన సుఖవేణత్తని యింతటి అనారోగ్య పరిస్థితుల్లో వెళ్ళి చూడాలన్న ఆలోచన నాకు రాకపోవడం నిజంగా ఎంత హైన్యం. అరుణ అన్నట్లు నా సంసారం, నా పిల్లలు, నా జీవితమే తప్ప ప్రక్కన ఏం జరుగుతుందో కూడ పట్టించుకోని ఈ మనస్థత్వం నాకెలా అబ్బింది?. సుఖవేణత్త కూడా ఇలానే తన స్వార్థం చూసుకున్నట్లయితే తాము అనాథల్లా దిక్కూ, మొక్కూ లేకుండా పోయేవారం కదూ?

"అత్తకి నిన్ను చూడాలని వుంది..." నాకు తలకి నూనె రాస్తూ మెల్లిగా చెప్పింది అరుణ. అరుణకి మాత్రం అత్త పెంపకంలో చాలా లౌక్యం అబ్బింది. అది కూడ అత్తలాగే అందరి బాగోగులూ కోరుకుంటుంది. పెళ్ళయిన తన సంసారం తను చేసుకుంటూ కూడ అప్పుడప్పుడూ వీలు కల్పించుకుని వెళ్ళి అత్తను చూసి వస్తుంటుంది... ఆడపడుచుకు తన నగలన్నీ పెట్టి పెళ్ళి చేసి పంపించింది. అత్తమామల్ని స్వంత తల్లిదండ్రుల్లా భావించి తన వద్దే ఉంచుకొని మంచిచెడులన్నీ చూసి సాగనంపింది.

మరి నేనో?

ఎంతసేపటికీ ఆయన ప్రమోషను గురించీ, బాబిగాడి ఇంజినీరింగ్ సీటు గురించి, పదేళ్ళు కూడా నిండని పాప భవిష్యత్తు గురించీ, ఇదేదీ కాదంటే ఇన్నాళ్ళ జీవితంలో కట్టుకోలేక పోయిన సొంత ఇంటి గురించీ, నిరంతరం ఎడతెగని ఆలోచనలే తప్ప మరో విషయం తనకు తెలీదు, పట్టదు. శ్లేష్మంలోపడ్డ ఈగలాగా ఈ నాలుగ్గోడల నడుమా కొట్టుకుపోతుంటాను. అంతలా ఇంటి కోసమే బతుకుతున్నా నిరంతరం ఏదో ఒక లోపాన్ని ఎత్తి చూపి ఆయన నన్ను సతాయిస్తూనే ఉంటారు. అది వేరే సంగతి...

నన్ను గురించి, మా చుట్టుపక్కలంతా ఏమనుకుంటారో నాకు తెలీదు గానీ అరుణ ఇలా ఎన్నడూ ఎత్తిచూపి ఉండలేదు.

"అఖిలా... ఏంటే ఆలోచనలో పడ్డావు. నేను చెప్పేది వింటున్నావా లేదా? చిన్నప్ప ట్నుంచీ అత్త మనవి ఎంత అపురూపంగా పెంచుకొచ్చిందో మనం మర్చిపోకూడదు. తన

పిల్లల్ని, సంసారాన్ని కూడా కాదని మన కోసమేనన్నట్లుగా బతికింది. అదే ఇప్పుడు నాన్న బతికి ఉన్నట్లయితే అత్తని అలా వదిలేసే వారేనా..." నాకు జడవేయడం పూర్తిచేసి, పక్కనే కూర్చుని నా ఒళ్ళో తల పెట్టుకుని పడుకుంది అరుణ మౌనంగా కళ్ళు మూసుకుని. మూసిన దాని కనురెప్పల వెనుక నాన్న ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నట్లుగా గమనించాను. నాన్న జ్ఞాపకాలతో నాకూ గుండె బరువెక్కింది.

అరుణ హైదరాబాద్‌లో ఉంటోంది. దాని భర్త అక్కడి ఎజి ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు. నేనుంటోన్న నెల్లూరికి అత్త ముప్ఫయి మైళ్ళ దూరంలో ఉంది. అంత దూరం నుండి అరుణ అత్తని చూడ్డానికి వచ్చింది. అలాగే నన్నూ ఒక చూపు చూసిపోడానికి వచ్చినట్లుంది. ఆరోజంతా అత్తని గురించి మాట్లాడుతూనే నా ఇల్లంతా సర్దిపెట్టింది. నేను ఏమీ మాట్లాడకుండా మౌనంగా చూస్తూ, వింటూ ఉండిపోయాను. సాయంత్రం పిల్లలొచ్చాక వాళ్ళతో ఒక గంట గడిపి ఎంత చెప్పినా వినకుండా, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళిపోయింది.

అరుణ నాకు సూటిగా ఏమీ చెప్పకపోయినా, నేను గట్టిగానే నిర్ణయించుకున్నాను వెళ్ళి అత్తను చూసి, నా వద్దకు తీసుకురావాలని.

"పిల్లల్ని స్కూలుకి పంపి, ఇంట్లో పని చూసుకుని నువ్వటూ, నేనిటూ ఆఫీసులకి వెళ్ళడమే గగనమవుతోంది కదా. మీ అత్తను తీసుకొచ్చి ఎలా అట్టి పెట్టుకుంటావిక్కడ నువ్వే ఆలోచించుకో" చెప్పారాయన కోపమూ, కోపం కాని స్థితిలో.

నాకు కడుపులో పేగెక్కడో కదిలినట్లుగా అయింది.

ఆయన వెళ్ళిన వైపే ఆశ్చర్యంగా చూస్తుండిపోయాను.

వాళ్ళమ్మగారికి గుండె జబ్బు చేసినప్పుడు నేనిటు ఆఫీసుకి వెళ్తూనేకదా ఇంట్లో ఆవిడకి నానా చాకిరీ చేశాను. ఆయన తరపున వచ్చిపోయే బంధువులందరికీ ఏ మాత్రం విసుగు పడకుండా వండి వడ్డిస్తూనే ఉన్నాను కదా. అసలు తన కోసమంటూ ఈ ఇంటికి ఎవరొస్తారు... నేనే ఆయన అన్నట్లుగా బతికేస్తున్నాను. కానీ ఆయనలా అనుకుంటున్నట్లుగా లేదు. సుఖవేణత్తని తీసుకురావడానికి ఆయనేమన్నారూ

'నీ ఇష్టం ఆలోచించుకో... ఆవిడొస్తే చాల ఇబ్బందవుతుంది. అన్నారా?' నిజమే సుఖవేణత్త నాకెక్కువయితే కావొచ్చు కానీ ఆయనకెక్కువెలా అవుతుంది...? మరి ఆయన తరపు బంధుమిత్రుల గురించి నేనెన్నడూ ఇలా పరాయిగా భావించినట్లులేదే? ఒక రోజంతా ఆలోచిస్తూనే ఉండిపోయాను.

ఆయన కిష్టం లేకపోయినా, నేనెన్ని ఇబ్బందులు పడ్డా సుఖవేణత్తని నా వద్దకు తీసుకురావడానికే నిశ్చయించుకున్నాను. ఆరోజు ఆఫీసుకి సెలవు పెట్టి, బ్యాంకుకెళ్ళి డబ్బులు డ్రా చేసుకుని తెలిసిన టాక్సీ ఒకటి మాట్లాడుకుని అత్త దగ్గరికి బయల్దేరాను.

ఊరి మొదట్లో ఉన్న వేపచెట్టు కింద రచ్చబండ మీద కూర్చుని ఊరివాళ్ళతో చర్చలు చేస్తున్నాడు మామయ్య. ఆ వేపచెట్టుని చూడగానే నా గుండె కంజరి ఆలపించింది. ఆచెట్టుకీ,

నా బాల్యానికీ అవినాభావ సంబంధముంది. శని, ఆదివారాల్లో సుఖవేణత్త అరుణనీ, నన్నూ, లలితనీ, శ్యాంబాబునీ తీసుకుని ఈ ఊరొచ్చేది. మేమంతా ఈ వేపచెట్టు కిందే బస్సు దిగేవాళ్ళం. అరుణ బుద్ధిగా అత్తతో ఊళ్లోకి నడిస్తే నేనూ, శ్యాంబాబు మాత్రం చేతులు పట్టుకుని చెట్టా పట్టాలేసుకుంటూ వేపచెట్టు కిందికి పరుగు తీసేవాళ్ళం. కానీ తరువాత తరువాత అత్త నన్నలా వెళ్ళనిచ్చేదికాదు. నా చేయి పట్టుకుని

"అఖీ! మామయ్య ఇంటికొస్తార్లే...నువ్వలా వెళ్ళకూడదు" అనేది అత్త.

'శ్యాంబాబు వెళ్ళొచ్చా ? నేను మాత్రం ఎందుకెళ్ళ కూడదేం?' అనాలన్పించినా అత్త మాటకి ఎదురు చెప్పడం ఇష్టంలేక మౌనంగా అత్తతో పాటు నడిచేదాన్ని. అప్పట్లో ఇలా ఊళ్లోకి దారులుండేవి కాదు. పచ్చటి పంట పొలాల మీది నుండి వచ్చే మట్టి వాసన పీలుస్తూ గట్ల వెంబడి వరుసగా క్యూలోలా నడిచేవాళ్ళం. కాళ్ళు గెనాల మీద కదుల్తున్నా మనసు మాత్రం వెనక్కి వేపచెట్టు కింది రచ్చబండ మీదకి పరుగుతీసేది. శ్యాంబాబుతో కలిసి దాగుడు మూతలు ఆడ్డం అంటే చెప్పలేనంత ఇష్టంగా ఉండేది తనకి. ఆ వేపచెట్టు పూర్వజన్మలో నాకు పరిచయస్థురాలిలాగా, బాల్యంలో నన్ను వదిలిపెట్టిపోయిన 'అమ్మ'లాగా తోచేది. శ్యాంబాబూ, నేనూ స్నేహంగా ఉండటం చూసి అత్త ఎన్నోసార్లు కళ్ళనీళ్ళు పెట్టుకునేది.

'వీడు నీకన్నా కాస్త ముందు పుట్టి ఉన్నట్టయితే ఏ దిగులూ లేకుండా నిన్ను నాకోడల్ని చేసుకుని ఉందునే అఖిలా" అంటూ, అప్పట్లో అత్త మాటలకి అర్థం తెలీకపోయినా, ఇప్పుడా లోచిస్తుంటే అత్త మనసు అర్థమై నా గుండె నరాలనెవరో కొనగోటితో మీటినట్లుగా అన్పిస్తుంది.

మేమంతా వేపచెట్టు వద్ద బస్సు దిగి పొలం గట్లవెంబడి నడుచుకుంటూ ఊరి చివరనున్న ఇంటికి వెళ్ళేవేళకి వాళ్ళ అత్తగారు తిట్లతోనూ, శాపనార్థాలతోనూ ఆహ్వానం పలికేది.

"అయినా ఇట్టా ఎక్కడా చూళ్ళేదమ్మా... ఎంత అన్న పిల్లలయితే మాత్రం...ఇల్లూ, వాకిలీ మొగుడూ, మొద్దులూ వదులుకుని ఈ విధంగా చాకిరీ చేసేవాళ్ళని నేనేడా చూళ్ళేదు... ఈ చంటిదాని గోడు నేను చూడలేకుండా ఉన్నాను...అంటూ ఏడవని ఝాన్సీని అదేపనిగా ఏడ్పించేది... అడ్డూఆపూ లేకుండా అపారంగా సాగిపోయే ఆవిడ సణుగుడు కార్యక్రమంలో సగానికి సగం నాకర్థమయ్యేదికాదు. అత్త ఎన్నడూ నోరు తెరచి మాట్లాడ్డం నేను చూడలేదు. ఆమె సహనం నాకు వింతగా ఉండేది.

అయితే అత్త తన పుట్టింటి నుండి వారానికి సరిపడా తెచ్చిన వస్తువులన్నీ ఇంట్లో అమరుస్తొంటే ఆవిడ నోరు కొంత మూతబడేది.

శనివారం మధ్యాహ్నం మేము ఊళ్ళో దిగితే ఆ రోజంతా మామయ్య అత్తతో మాట్లాడే వాడు కాదు...ఇల్లూ, వాకిలీ అంతా శుభ్రం చేసి పశువులూ, పాలెగాళ్ళనీ అందర్నీ పలకరించి రాత్రి పదిదాకా చాకిరితోనే సరిపోయేది అత్తకి. ఆదివారం మధ్యాహ్నం మామయ్య కొంత మెత్తబడి అత్తతో ఆ మాటా, ఈ మాటా కలిపేవాడు. ఆరోజు రాత్రి మాత్రం అత్త పెద్దహాల్లో మా అందరితోనూ పడుకునేది కాదు.

శ్యాంబాబూ, నేను పండరి భజనకి వెళ్ళి "పాండురంగా విఠలా...పండరినాథా విఠలా" అంటూ పాడుకుంటూ ఇంటికి వచ్చే వేళకి లలిత, అరుణ, ఝాన్సీ హాల్లో పడుకుని ఉండే వాళ్ళు. అత్త అత్తగారు సణుక్కుంటూ తలుపు తీసేది.

తెల్లవారకముందే నిద్రలేచి అయిదుగంటల బస్సుకి మళ్ళీ అంతా పోలోమని బయల్దేరే వాళ్ళం. మామయ్య బస్సుదాకా తోడొచ్చేవాడు. బస్సెక్కి మామయ్యతోపాటు వేపచెట్టుకి కూడా టా...టా... చెప్పేదాన్ని.

పిల్లలందరమూ బస్సులో మాటల్లో పడిపోతే అత్త యోగినిలా మౌనంగా ఉండి పోయేది. ఆ విధంగా అత్త పుట్టింటికీ, అత్తింటికీ నడుమ అరవచాకిరీ చేస్తూ కండలు కరగ దీసుకునేది. ఆ ఇంటికోసం,ఈ ఇంటి కోసం అహర్నిశలూ శ్రమపడిన అత్తని, పిల్లల బంగారు భవిష్యత్తు కోసం రాత్రింబవళ్ళూ నిద్రకాచిన అత్తని, స్వార్థం అన్నమాటకి అర్థమే తెలీని అత్తని తలచుకుంటే నా గుండెల్లో కన్నీటి చెమ్మ.

"ఎటెల్లాలండీ?" టాక్సీ డ్రైవర్ ప్రశ్నతో ఒకింత సర్దుకుని అత్త వాళ్ళ ఇల్లు చూపించాను. వాకిట్లో దిగేప్పటికి ఏమిటో అంతా బోసిగా అన్పించింది. అత్త ప్రేమగా పెంచిన జూకామల్లె తీగ గేటుకి పైన పూర్తిగా అల్లుకుపోయి ఉండేది. ఆ తీగ జాడ కూడ లేకపోవడమే ఆ బోసి తనమని క్షణం తరువాత కానీ స్ఫురించలేదు నాకు. ఆరుబయట మొక్కలేవీ లేవు.

ఝాన్సీ కానీ, లలిత కానీ వచ్చిన జాడలేవీ లేవు. అవును ఎవరి సంసారాలు వాళ్ళవి. ఎవరి కష్టాలు వాళ్ళవి. ఎవరు మాత్రం వచ్చి ఎల్లకాలం మన కష్టసుఖాలు తీర్చగలరు అత్తలాగా.

మెల్లిగా లోపలికడుగు పెట్టాను.

'కారు' ఆగిన శబ్దం విని శ్యాంబాబు భార్య 'ఇందు' వాకిట్లోకి వచ్చింది.

మోకాళ్ళదాకా ఎగదోపిన చీర, జారిపోతున్న పమిట కొంగూ, తలస్నానం చేసి జారుముడి వేసి ఉన్న ఆరని జుట్టూ, వెరశి అమ్మాయి ఏదో చాలా పనిలో ఉన్నట్లుగా ఉంది.

"రండి" అంటూ నవ్వీనవ్వనట్లుగా అని లోపలికెళ్ళిపోయింది.

అనుకోని వేళ అతిథుల రాక పల్లెటూళ్ళలో కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. నేను ఇందుని అనుసరించాను.

ఎందుకో తెలీదు గానీ లోపలికి అడుగు పెట్టగానే ఓ విధమైన శ్మశాన నిశ్శబ్దం నా గుండెల్ని ఒణికించింది. హాల్లోనే ఒక మూల కిటికీ ప్రక్కగా ఉన్న నులక మంచం మీద మూటలా పడి వున్న ఆ ఆకారం సుఖవేణత్త అని తెలుసుకోవడానికి నాకు రెండు క్షణాలు పట్టింది. తెలిసిన తరువాత జీర్ణించుకోవడానికి మరికొంత సమయం కావలసి వచ్చింది.

అత్త అటు వైపుకు తిరిగి పడుకుని ఉంది.

ఆయాసంతో ఆమె భుజాలు ఎగిసెగిసి పడుతున్నాయి. వీపు ఎగిరిపడ్తోంది. ఎప్పుడూ వెంకటగిరి, పాటూరు జరీ చీరలు మాత్రమే కట్టే ఒంటి మీద వెలసిపోయిన పాత గులాబీ రంగు టెరీన్ చీర అస్తవ్యస్తంగా కప్పబడి ఉంది. జాకెట్టు స్థానభ్రంశం చెంది ఉంది. ప్రక్కమీద దుప్పటి నల్లగా మాసి కమురువాసన వేస్తోంది. 'ఝుం' అనే నాదం చేస్తూ మంచం మీద, అత్త ఒంటి మీదా కూడ ఈగలు ముసురుకుంటున్నాయి. ఆ నిశ్శబ్ద మధ్యాహ్నం వేళ ఆ

శబ్దం మృత్యువు ఆలపించే విషాదగీతికలా తోచింది నా చెవులకి. తనపైన వాలుతున్న ఈగల్ని తోలుకునే శక్తి కూడ లేనట్లుగా, బలహీనంగా మంచానికి కరుచుకుపోయి వుంది అత్త.

నాకళ్ళల్లో ఊరిన నీళ్ళు అత్త ఆకారాన్ని అస్పష్టం చేస్తూండగా

"ఇదిగోండీ" అంటూ మంచినీళ్ళ గ్లాసందించింది ఇందు.

'వద్దు' అనడానికి గొంతు పెగలక మౌనంగా గ్లాసు అందుకున్నాను.

పాతకాలం నాటి ఓ బరువైన చెక్క కుర్చీని మంచం దగ్గరగా లాగి

"కూర్చోండి కాఫీ తెస్తాను" అంటూ ఆ అమ్మాయి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.. నిస్త్రాణగా ఆ కుర్చీలో కూలబడ్డాను.

అత్తను చూస్తుంటే అట్టడుగుపొరల్లో ఎక్కడి నుండో గేలంవేసి లాగినట్లుగా ఆర్ద్రత మనసంతా నిండి గొంతులో అడ్డుపడ్డట్టు అయింది. అత్త భుజంమీద చేయివేస్తూ "అత్తా " పిలిచాను.

ఒక్క పిలుపుతోనే అత్త నాగుపాములా చటుక్కున తలెత్తింది.

"ఎవరూ ... అఖిలా" అంటూ... మాట్లాడడంతోనే ఎక్కడుందో ఆ దగ్గు ఊపిరి ఆగి పోతుందేమోనన్నంత దారుణంగా అత్తని చుట్టుముట్టేసింది. నా కోసం ఎంతగానో ఎదురు చూస్తున్న ఆతృత ఉంది ఆ గొంతులో.

"అత్తా " మళ్ళీ పిలిచాను కళ్ళనీళ్ళు గొంతుకడ్డం పడుతూండగా.

"అఖీ.... నా బంగారు తల్లీ వచ్చావా అమ్మా ... నిన్ను చూడకుండానే పోతానేమో అనుకున్నానే బంగారూ... అత్తని చూడ్డానికొచ్చావా తల్లీ" నారెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుందత్త. నేను బాగా దగ్గరగా జరిగాను అప్రయత్నంగా...

"అత్తా ఎలా ఉంది నీకు?" ప్రశ్నించాను ఎలాగో గొంతు పెగుల్చుకుని అత్త తన కళ్ళల్లో ఊరుతోన్న నీటిని భయం భయంగా గబగబా తుడిచేసుకుంది. ఇందుగాని, మామయ్యగాని వస్తారేమోనన్నట్లుగా.

అత్తని చూస్తుంటే చెప్పలేనంత జాలేసింది. ఒకప్పుడు ఇదే ఇంట్లో యువరాణిలా ఒకే చేత్తో చక్రం తిప్పిన అత్త, తన అత్తగారికి ఏనాడూ పల్లెత్తుమాట ఎదురు చెప్పని అత్త ఈనాడు తన కోడలిని చూసి భయపడ్తోంది...

గుసగుసగా ఏదో రహస్యం చెప్తున్నట్లుగా చెప్పింది అత్త

"నాకు బాగలేదే అఖీ నేనింక బతకను... మీమామయ్య నన్ను డాక్టరు దగ్గరికి తీసికెళ్ళరట..." చెప్పింది.

"ఛ...ఛ... అదేమిటత్తా అలా అంటావు... ఎందుకు చూపించరూ" చెప్పాను నేను నా సహజ ధోరణిలో.

"నీకు తెలీదే తల్లీ డబ్బులయిపోతాయట... ఎలాగూ చచ్చేదానికి డబ్బులెందుకూ ఖర్చు చేయడం అంటున్నారే" చెప్పింది బాధగా. కనుకొలకుల్లోని నీళ్ళు బయటకు ఊరకుండా

ఉండడం కోసం నేను విశ్వప్రయత్నం చేస్తున్నాను. అదిమిపట్టిన ఉద్వేగంతో నా గుండెలూ, భుజాలు ఎగిసెగిసిపడుతున్నాయి.

"అఖిలా నా తల్లీ... మళ్ళీ ఇదంతా నువు చెప్పొద్దే మీ మామయ్యతో 'నా పరువు తీస్తున్నావా?' అంటూ మళ్ళీ నన్నే కోప్పడుతారు" అంటూ క్షణమాగి 'అఖీ... నాకో వెయ్యి రూపాయిలిస్తావా డాక్టరుకి చూపించుకుంటాను" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఆమాట అడగడానికి ఎన్నో శక్తుల్ని కూడదీసుకున్నట్లుగా ఉంది అత్త. అత్త దీనస్థితికి బాధతో గుటకలు వేస్తున్నాన్నేను.

"ఈ ఆయాసం, దగ్గూ తట్టుకోలేకుండా ఉన్నానే..." ఇదంతా మాట్లాడుతూ అత్త ఎడతెరపి లేకుండా దగ్గుతూనే ఉంది.

"ఇదిగోండి కాఫీ... ఆవిడిది రోజు ఉండే భాగోతమే లెండి" తేలిగ్గా తీసిపారేసినట్లుగా అంటూ నా చేతికి కాఫీ అందించింది ఇందు.

"శ్యాంబాబూ, మామయ్యలేరా?" మామయ్యని రచ్చబండ కాడ చూసి కూడ ఏదో మాట్లాడాలన్నట్లుగా అడిగాను.

"ఈయన టవున్లో పనుందని వెళ్ళారు... మామయ్య వేపచెట్టు దగ్గరున్నట్టున్నారు. టాక్సీ రావడం చూశారుగా వస్తూంటార్లెండి" ఇందు అంటూండగానే

"ఏమ్మా అఖిలా నువ్వొక్కదానివేనా వచ్చావు?" అంటూ లోపలికి వచ్చారు మామయ్య.

"అవును మామయ్యా అరుణొచ్చి అత్తకి చాల బాగలేదని చెప్పింది. అందుకే చూసి నాతోపాటు తీసుకెళ్దామని వచ్చాను.. డాక్టరుకి చూపించి నాలుగు రోజులుంచుకుని తీసుకొచ్చి వదుల్తాను" చెప్పాన్నేను నిశ్చయించుకున్నట్లుగా.

"ఏం నేను డాక్టరుకి చూపించడంలేదనీ, మందులిప్పించడం లేదనీ చెప్పిందా? ఇంతకాలం ఎవరు చూశారట?" విసురుగా కోపాన్ని నిగ్రహించుకుంటూ అన్నాడు మామయ్య. విస్తుపోయాన్నేను. మంచం మీద దీనస్థితిలో ఉన్న భార్య మీద ఇంత పట్టరాని కోపమెందుకో నాకర్థం కాలేదు. మగాళ్ళు ఎక్కడయినా ఇంతేనా. తాము మొదటిజాతి వాళ్ళం, భార్యలు రెండోజాతి వాళ్ళు అన్నట్లుగా ఏమిటీ ఆధిక్యత. మా ఆయన, మామయ్య, ఎదురింటి సుజాత భర్త... అంతా మగాళ్ళు.

"నేను రాను... నేను రానంటే రాను...నేనెక్కడికీ రాను కడుపున పుట్టినబిడ్డలే ఈ దినాల్లో పడక మీద పండబెట్టి చేయాలంటే విసుక్కుంటుంటారు... నీకేం పట్టింది నువ్వెందుకు చేస్తావు...?" ఒకవైపు దగ్గుతూ, ఆయాసపడుతూనే హిస్టీరిగ్గా అరుస్తోన్న అత్తకేసి జాలిగా చూశాను.

"పడక మీదున్నా కూడ నోరు ఏ మాత్రం తగ్గలేదే నీకు. ఆ నోటిపొగరుతోనే ఇంత తెచ్చుకున్నావు" అంటూ దూకుడుగా మంచం మీదకెళ్ళాడు మామయ్య. మామయ్యలోని మగాడికేసి జుగుప్సగా చూస్తున్నాను.

అత్త దణ్ణం పెడుతూ దీనంగా ఏడ్చేసింది.

"ఏడవకత్తా ప్లీజ్... నిన్ను నేను బ్రతికించుకుంటాను" ధైర్యంచెప్తూ నేనూ ఏడ్చేశాను నిగ్రహించుకోవడం సాధ్యంకాక.

"ఆ అవును ఇక్కడ మేమంతా చంపేస్తున్నాం ఈవిడ తీసికెళ్ళి బతికించుకుంటుంది..." వ్యంగ్యంగా అంటూనే "అఖిలా నేనూ ఈ రోజో, రేపో టవునుకి తీసికెళ్ళి డాక్టర్‌కి చూపిద్దామనే అనుకుంటున్నాను... నాకు నింద రావడానిక్కాకపోతే నువు తీసికెళ్ళి చూపించేదేమిటి?" నాపెళ్ళాన్ని గురించి నువ్వు జాగ్రత్త చెప్పేదేమిటి అన్నట్లు విసుగ్గా అరిచాడు మామయ్య.

"నేను రాను-నువ్వెవరు నన్ను తీసికెళ్ళటానికి?" హిస్టీరిగ్గా అరుస్తోంది అత్త దగ్గుతూ, ఆయాసపడుతూనే. నేనొచ్చి అనవసరంగా ఆమె శరీరానికి లేనిపోని శ్రమా, మనసుకి యాతనా కల్గించానేమో అన్పించింది.

విసురుగా లేచి పైగుడ్డ విదిలిస్తూ బయటికి నడిచాడు మామయ్య. నిస్సహాయంగా నిలబడిపోయాను నేను..

"అఖిలా" అత్త ఏడుస్తూనే ఉంది.

"అఖిలా... నన్ను డాక్టరు దగ్గరకు తీసికెళ్ళరే వీళ్ళు... డబ్బయిపోతుందని చూపించ కుండానే చంపేస్తారే... నన్ను చంపేస్తారే అఖిలా...అందుకోసమే చూస్తున్నారు వీళ్ళు. నేను నా పుట్టింటి నుండి ఎంతెంత డబ్బు తెచ్చిపెట్టానే వీళ్ళకి. ఎంత చాకిరీ చేశానే ఈ ఇంటికి...?" ఏడుస్తూనే ఉందత్త. ఈసారి ఇందు వచ్చి నిల్చున్నా లెక్కచేయకుండా.

ఆ క్షణం ఆమె ప్రాపంచికశక్తులకు అతీతురాలిలా, జీవితాన్ని లొంగదీసుకోలేక అశక్తు రాలయి, అసహాయంగా ఆగిపోతున్న ఊపిరిని కూడదీసుకుంటూ శూన్యంలో కలిసిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంది.

నిజమే అత్త ఈ ఇంటికి ఎంత చాకిరీ చేసింది? తన అన్న ఇచ్చిన డబ్బంతా మామయ్యకి కొంచెం కూడ కష్టం కలగనీయకుండా, ఈ ఇంటికే ఖర్చు చేసింది. వాళ్ళత్తగారు మంచాన పడితే సొంత కూతురిలా సేవ చేసింది. అటు అన్న సంసారాన్ని చక్కబెడ్తూనే, ఇటు తన పిల్లలకి ఏలోటూ రానివ్వకుండా పెంచి పెద్దచేసి పెళ్ళిళ్ళుచేసి ఒకింటివాళ్ళను చేసింది.

అన్ని విధాలుగానూ దోపిడీకి గురయిన ఆ ఇల్లాలికి ఈ మునిమాపు వేళ జబ్బుచేస్తే డాక్టరు వద్దకి తీసికెళ్ళడానికి డబ్బులేదా...? డబ్బు లేకపోవడం వేరూ, ఖర్చయిపోతుందని వెనుకాడ్డం వేరూ. ఈ పరిస్థితుల్లో నేను అత్తని తీసికెళ్ళాలా? వద్దా? మామయ్యకి ఇష్టంలేకుండా తను తీసుకెళ్ళడం బావుంటుందా? మామయ్యకి కోపం వస్తుందేమో .

ఛీ... లలిత, ఝాన్సీ వాళ్ళు అత్తని ఈ పరిస్థితుల్లో వదిలిపెట్టి ఎలా వెళ్ళారు? వాళ్ళు కొంచెం గట్టిగా దభాయించి ఉంటే మామయ్య మాత్రం ఒప్పుకుని ఉండేవాడు కాదా? తండ్రికి నచ్చచెప్పో, కోప్పడో తల్లిని తీసికెళ్ళి చూపించాల్సిన బాధ్యత లేదా కూతుళ్ళకి...?

పరిపరివిధాలుగా పోతున్న మనసుని అదుపులోనికి తెచ్చుకుంటూ, భోజనం కూడ చేయకుండా లేచి నిల్చున్నాను .

"అత్తా వెళ్ళొస్తాను" అంటూ .

"అఖిలా" అంటూ బిగ్గరగా ఏడ్చేసింది అత్త .

ఆ ఏడుపు హృదయవిదారకంగా నన్ను చుట్టుముట్టేసింది. నేనూ జలజలా రాలిపోయాను. పదినిముషాల తరువాత బయటికొచ్చి మామయ్యకి దండంపెట్టి చెప్పాను భయపడ్తూనే "ప్లీజ్ మామయ్యా... అత్తయ్యకి మంచిమంచి మందులిప్పించండి." నవ్వాడు మామయ్య .

"ఇంకేమీ లాభంలేదమ్మా... లేదంటే నేను మాత్రం చూపించనా చెప్పు..." అన్నాడు ఒకింత దుఃఖంతో .

అలా అంటుంటే మామయ్య బుగ్గలు సాగి కళ్ళు కుంచించుకుపోయి భుజాలు ఎగిసిపడ్తున్నాయి. అంటే మామయ్య కూడా బాధపడుతున్నాడా? లేక నటిస్తున్నాడా? ఛ...ఛ... బాధలేకుండా ఎలా ఉంటుంది? నిజంగా ఉంటే మరి అత్తనిలా బాధించడమెందుకు. అత్త తృప్తికోసమయినా డాక్టరువద్దకి తీసికెళ్ళొచ్చుకదా... అదే చెప్పాను మామయ్యతో కొంచెం శక్తి కూడదీసుకుని.

"అలాకాదు మామయ్యా... మీకు తెలీదని కాదు... మన ప్రయత్నం మనం చేయాలి కదా... ఎలాగూ ఆవిడ బతకదు కదాని నిర్లక్ష్యం చేయగలమా? ఒక్కసారి తీసికెళ్ళి డాక్టరుకి చూపించితే అత్తకి మోరల్‌సపోర్టు. ఒకవేళ మీరు చెప్పినట్లు ఆవిడ బతక్కపోయినా ప్రశాంతంగా నయినా కన్నుమూస్తుంది. మీకు నేను చెప్పగలిగేదాన్నికాదు. ఒక్కసారి ఆలోచించండి మామయ్యా"

చెప్పాను నేను. 'అరెఁ నాక్కూడ కర్ర విరక్కుండా , పాము చావకుండా మాట్లాడ్డం చేతనవునే' అనుకున్నాను .

"అలాగేనమ్మా... నువు చెప్పినట్లే ఒకసారి చూపించేద్దాం" అన్నాడు మామయ్య కమిటవుతున్నట్లుగా. "నేనూ అనుకుంటూనే ఉన్నాను. రేపే వస్తాం నేనూ మీ అత్తయ్యా" ఆ మాటలెందుకో చాల బలహీనంగా తోచాయి.

టాక్సీలో తిరిగి వస్తుంటే అత్తింటికీ, పుట్టింటికీ నడుమ అరవచాకిరీ చేస్తూ కండలు కరిగించుకున్న అత్త తనని గురించి తాను పట్టించుకోని అత్త దీనంగా కళ్ళముందు కన్పిస్తూనే ఉంది.

ఆ మరునాడు, మూడోనాడు కూడ అత్త, మామయ్య వస్తారని చాలా ఎదురుచూశాను. రాలేదు. నాలుగోరోజు ఉదయం నేనే అత్తని తీసుకువద్దామా అన్న ఆలోచన పూర్తికాకముందే పోస్టుమాన్ టెలిగ్రాం తెచ్చాడు .

అత్త చనిపోయిందన్న వర్తమానాన్ని మోసుకొచ్చిన టెలిగ్రామ్ అది .

నిజాన్ని స్వీకరించక నా మెదడు నరాలు నెట్టేస్తున్నాయి .

బరువెక్కిన గుండెలు ఏడవాలన్న ఆలోచనని కూడ మరిచి నిలువుగుడ్లేసుకున్నాయి. మామయ్య సాధించాడు. డబ్బు ఖర్చు చేయకుండానే అనుకున్నది సాధించాడు .

విజయగర్వంతో ఉన్న మామయ్య ముఖం నా కళ్ళముందు కదలాడింది .

అత్త సుఖపడిపోయిందనుకున్నాన్నేను. ఎన్నోవిధాలుగా దోపిడీకి గురయిన అత్తకి మరణంలోనే సుఖం దొరికింది .

అత్త మరణంతో చప్పున నాకో నగ్నసత్యం తెలిసొచ్చింది .

'ఇల్లాలి సుఖం' చావులోనే ఉందని.

భూమిక, జనవరి-మార్చి 1995